# సన్యాసిరావూ - సబర్బన్ ట్రైనూ/-

ప్లాట్‌ఫాం నంబర్ చార్ వరూన్ సహావాజూన్ ఏక్‌తీస్ మినిటాని సుట్‌నారి విరార్ లోకల్ ఆజ్ ప్లాట్ ఫాం నంబర్ ఏక్ వరూన్ సుటేల్”

ప్లాట్‌ఫాంపై కోలాహలం.

చర్చిగేట్ స్టేషన్ ప్లాట్ ఫాం నంబరు నాలుగుపై నుంచున్న సన్యాసిరావుకు అందరూ వేరే ప్లాట్‌ఫాం వైపు ఎందుకు పరుగెడుతున్నారో అర్థం కాలా. ఇంతలో ఇంగ్లీషులో ప్రకటన. సారంశమేమంటే ఆరూ ముప్పై ఒకటికి ఫ్లాట్ ఫాం నెంబర్ నాలుగుపై రావాల్సిన విరార్ లోకల్ ఈరోజు ఫ్లాట్ ఫాం నెంబర్ ఒకటిపై వచ్చును అని. అది అతనికి అర్థమై ఆ ఫ్లాట్ ఫాం పైకి చేరేసరికి ఆ రైలు కాస్తా తుర్రుమంది. (ఎలక్ట్రిక్ ట్రైన్ తుర్రుమంటుందా అనా మీ సందేహం? గుర్రుమంది – ఉహూ కాదు. ఓ పెద్ద కేకవేసి ఫట్ ఫట్ మంటూ వెళ్ళిపోయింది సరేనా?) సన్యాసి రావు ఊసూరుమన్నాడు. తర్వాతి విరార్ రైలు పదిహేను నిమిషాల తర్వాతే అదీ మూడవ నెంబరు ఫ్లాట్‌ఫాం పైన, మూలుగుకుంటూ మూడవ నెంబరు వైపు అడుగులు వేసాడు సన్యాసిరావు.

రైలు ఆగీ ఆగకముందేలోనికి దూకిసీట్లు ఆక్రమించుకుంటున్నారు జనాలు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించినప్పుడు కూడా మన సైనికుల కళ్ళల్లో ఆ మెరుపు కనబడలేదేమో. సన్యాసిరావు ఎలాగోలా లోపలికి చొచ్చుక పోయి నుంచుండే చోటు సంపాదించుకున్నాడు. కదిలే రైల్లోకి దూకి సీటు దొరికించుకునే స్థాయికి ఇంకా ఎదగలేదతను!

అనకాపల్లిలో, ఆంధ్రా యూనివర్శిటీలో హాయిగా, జల్సాగా రోజులు గడిపినవాడు ముంబయిలో ఈ గడ్డు జీవితంలో చిక్కుకుపోయాడు. పాపం! జీతమా అయిదంకెలదే కానీ .. ఈ మాయనగరంలో ఒక్కడి పొట్టకే చాలకుండా ఉంది.

అనకాపల్లిలో బెల్లం వ్యాపారం చేసినా జీవితం ఇంకా సుఖంగా, సాఫీగా గడిచేదేమో అనిపిస్తుందతనికి అప్పుడప్పుడు. అయినా ఈ హోదాలో ఉన్న మజాయే వేరు. కామర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన తనకి, పోటీ పరీక్షల పుణ్యమా అని ఓ ప్రభుత్వ రంగ సంస్థలో ఆఫీసరు ఉద్యోగమొచ్చింది. బొంబాయిలో పోస్టింగ్ అనగానే ఎగిరి గంతేసాడు సన్యాసిరావు.

అయిదు నక్షత్రాల హోటళ్ళు, బాలీవుడ్ కేళీ విలాసాలు, డిస్కోలు, పార్టీలు ఈస్ట్‌మన్ కలర్లో కన్నుల ముందు కదలాడాయి. తీరా వచ్చిచూస్తే ఏముంది? ఎక్కడ చూసినా జనం, జనం, ఉరుకులు, పరుగులు, ఎక్కడికో తెలీదు. ఎందుకు అంత హడావిడో అర్థం కాదు. పుట్‌పాత్‌లు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తమ గూడుగా చేసుకుని పోలీసుల, దళారుల దౌర్జన్యాలు సహిస్తూ, ఏమాత్రం 'చాటు' లేకుండా తమ దినకృత్యాలు తీర్చుకుంటూ ఇంత నికృష్టమైన జీవితం ఎందుకో గడపడం?

సన్యాసిరావు పరిస్థితీ అంతకంటే భిన్నంగా లేదు. ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లు,

అతని అవస్థలు అతనివి. ఆంధ్రాలో హస్కులు కొట్టడం బాగా అలవాటున్న అతనికి ఇక్కడ తీరికలేదు. బొంబాయి ప్రాపర్‌లో తన జీతం అద్దెకు కూడా సరిపోదని, సిటీకి నలభై కిలో మీటర్ల దూరంలో గది చూసుకున్నాడు. ఉదయం ఏడు గంటలకు బయలుదేరితే రాత్రి తొమ్మిది గంటలకే ఇల్లు మొహం చూడడం. ఇల్లూ - ఆఫీసు - ఇల్లు. ప్రయాణంలోనే అయిదారు గంటలు గడచిపోతాయి. ఒకే ధాటి ప్రయాణమా అంటే, అదీ కాదు ఇంటి నుంచి స్టేషను దాకా ఆటో లేక బస్సు, ఆ తర్వాత గంటన్నర సబ్బర్బన్ ట్రైన్ ప్రయాణం. చర్చిగేట్ స్టేషన్లో దిగి ఆఫీసు దాకా బస్సు లేక టాక్సీని ఆశ్రయించాలి. ఆఫీసులో ఎనిమిది గంటలు ఒళ్ళు వంచి పని చేయాలి. తెలుగు కథల్లోలా క్యాంటిన్లో కాలక్షేపాలుండవు. తిరుగుప్రయాణం? షరా మామూలే! ఉదయం నుంచి రాత్రి దాకా నిరంతరం సాగిపోయే సమరం. ఇక పిచ్చాపాటికి ఆస్కారమేదీ?

"అగే చలో భాయ్, దేఖ్‌తా నాహి క్యా కిత్‌నా భీడ్ హై? ముంబైమే నయా ఆయా క్యా? ఆరామ్ సే ఫంఖేకే నీచే ఖడారహ్‌నా హైతో ఘర్‌మే బైఠో" ఒకాయన గట్టిగా నెట్టడంతో ఇహలోకంలోకి వచ్చాడు సన్యాసిరావు అతని అనకాపల్లి విహారానికి విఘ్నం కలిగింది. సీట్ల రెండు వరుసల మధ్య కూడా తిన్నగా నుంచోనీయరు. ఆనుకుని నిలబడడం, తోయడం, నెట్టడం యమ చికాకు. చెడు వాసన, బీడీల, గుట్కాల కంపు డోకొచ్చినట్టైంది. సన్యాసిరావు ఎలాగో నిలదొక్కుకున్నాడు.

కొత్తలో పరిస్థితి మరీ ఘోరంగా ఉండేది. ఎందుకు తోస్తున్నారని అడిగి చీవాట్లు తిన్నాడు. పైగా అంత నాజుకు వాడివైతే ఫస్ట్‌క్లాస్‌లోకి వెళ్ళు అని ఉచిత సలహా, ఇప్పుడు స్థితిగతులు మారాయని కాదుగాని సన్యాస్‌రావు సబర్బన్ ప్రయాణానికి అలవాటు పడిపోయాడు.

ముంబయి వచ్చిన కొత్తల్లో....

కొలాబాలో ఆఫీసు ఉండేది. డొంబివిలిలో ఇంకో ఇద్దరు మిత్రులతో కలసి ఉండేవాడు. ఆఫీస్ టైంలో ట్రైన్ ఎక్కడం దిగడం చాలా కష్టంగా ఉండేది. ఇలా కాదని కల్యాణ్ నుండి వి.టి. (ఇప్పటి ఛత్రపతి శివాజీ టర్మినస్, సి.ఎస్.టి) వరకు సీజన్ టిక్కట్టు తీసుకున్నాడు! డొంబివిలి నుండి కల్యాణ్ ట్రైన్‌లో వెళ్ళి, ఆ ట్రైన్ తిరుగు ప్రయాణంలో విటీ వరకు వెళ్ళసాగాడు. దాంతో ఇరవై నిమిషాల సమయం వృథా అయినా, రద్దీని తప్పించుకుని, కూర్చుని వెళ్ళడం హాయిగా ఉండేది. అరగంట పేపర్ చదువుకోవడం, అరగంటకు పైగా నిద్రపోవడం, ప్రాణానికి సుఖంగా ఉండేది. (ముంబయిలో ట్రైన్‌లో నిద్ర పోతారు, ఆఫీసుల్లో కాదు) సీజన్ టిక్కట్ తీసుకున్న రెండో రోజు డొంబివిలీలో కల్యాణ్ వెళ్ళే రైలెక్కాడు. కల్యాణ్‌లో బండి ఆగీ ఆగక ముందే బిలబిలమంటూ జనం కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కారు. తన చుట్టు ప్రక్కల కూర్చున్నారు. తను విండో సీటులోంచి లేవకపోవడంతో పెద్ద గొడవ.

"కొత్తగా వచ్చావా? మా సంగతి తెలీదా? మా సీట్లో కూర్చోడానికి ఎంత ధైర్యం? నీకు? ఒళ్ళు జాగ్రత్తగా ఉండాలంటే మాతో పెట్టుకోకు. దేశం గొడ్డుపోయినట్లు ఎక్కడి వాళ్ళూ ఇక్కడికే వచ్చి చస్తారు." ఇదీ హిందీ, మరాఠీలోని వారి మాటల సారాంశం. వారికి కిటికీ చోటిచ్చి ప్రక్క బెంచీ పై ఒదిగి కూర్చున్నాడు సన్యాసిరావు. ఇంతకీ వాళ్ళు సీటు రిజర్వేషను ఉన్నవాళ్లు కాదు. సబర్బన్ రైళ్ళలో రిజర్వేషనుండదు. వారి దొక పేకాట

బృందం. ప్రతిరోజూ అదే ట్రైనులో అదే చోటలో కూర్చునే వారి అలవాటును హక్కుగా మార్చుకున్నారు. వారి అరుపులు, విసుర్లు, చీట్లాట్లలో పోట్లాటలు, దాదర్లో వారు దిగిపోయే దాకా, తల దిమ్మెక్కిపోయింది సన్యాసిరావుకు. మర్నాడు కంపార్టుమెంటు మారాడు.

అక్కడ కూడా అలాంటి గతే పట్టింది. కాకపోతే వారొక భజన మండలివారు. కళ్యాణ్ రాగానే ఎనిమిది, పదిమంది ఎక్కి తనను విండో సీటు నుంచి లేపేసారు. కంపార్టుమెంటు కిటికీకి ఓ చిన్న బ్యానరు లాంటిది కట్టారు. దానిలో వారి భజన మండలి పేరు, ఆ ట్రైన్ నెంబరు, టైము, వగైరాతో పాటు, రెండు మూడు దేవతల ఫోటోలు అతికించి ఉన్నాయి. ట్రైను కదలగానే వారి భజన పాటలు మొదలయ్యాయి. హిందీ, మరాఠీ, గుజరాతీ, భాషలలో ఒకరి తర్వాత ఒకరు భక్తి గీతాలు పాడుతూనే ఉన్నారు. కొందరు తాళాలు వాయిస్తుంటే కొందరు కంపార్ట్మెంట్ గోడకు తబలా వాయిస్తున్నారు. అందరూ కోరస్‌లో దరువు అందుకోవడం; స్టేషన్లో ఆగినప్పుడల్లా ఫ్లాట్ ఫాంపై ఉన్న వారికి చక్కెర పేలాలు ప్రసాదంగా ఇవ్వడం, కంపార్ట్మెంట్‌లో కూడా అందరికి ప్రసాదం పంచడం – అదో లోకం. సన్యాసిరావు చీదరించుకున్న ముఖం చూసి ఒక ముసలాయన "శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. నాయనా ప్రయాణ బడలికతో అలసి పోకుండా ఉండడానికి ఎన్నో వ్యాపకాలు. కొత్తగా ముంబై వచ్చినట్టున్నావు అదే అలవాటౌతుంది" అని హితబోధ చేశాడు.

వారం రోజులు ట్రయల్ అండ్ ఎర్రర్ అయ్యాక పేకాట, భజన లేని కంపార్ట్మెంట్ దొరికించుకోగలిగాడు సన్యాసిరావు. చప్పుడుకి అలవాటు పడిపోవడం వలన, పత్రికలు చదవడానికి గాని, ట్రైన్లో నిద్రపోవడానికిగాని అతనికి భంగం కలగలేదు. ఇప్పుడు చప్పుడు లేకపోతేనే అదోలా ఉంటుంది. సబర్బన్ యానంలో ఎన్నో చిత్ర విచిత్ర అనుభవాలు కలిగాయి సన్యాసిరావుకు.

ఇండికేటరు చూడకుండా ట్రై నెక్కితే తను దిగాల్సిన స్టేషన్లో ఆగకపోయేసరికి బిక్క చచ్చిపోవడం. డోంబివిలి వెళ్ళాలని విటీలో రైలెక్కుతే అది హార్బరు రూట్లో కొత్త బొంబాయి వైపు వెళ్ళడం, తిరిగి తన గమ్యం చేరుకోవడానికి కుర్లా వచ్చి ఇంకో రైలెక్కడానికి నానా ఇక్కట్లు పడడం. వర్షాకాలం పట్టాలపై నీళ్ళు నిండి రైళ్ళు ఆగిపోతే ఫ్లాట్‌ఫాం పైనే ప్రొ గడపడం, పట్టాలగుండా నడచుకుంటూ వెళ్ళడం. ఇలా ఎన్నెన్నో అనుభవాలు.

కంపార్ట్మెంట్‌లో కలకలంతో సన్యాసిరావు మళ్ళీ ముంబైకి దిగివచ్చాడు. కాందీవలీ బోవలీ మధ్యలో రైలు ఆగి ఉంది. ఏం ఫాస్ట్‌ట్రైన్ రా బాబూ అని ఒకడంటే, 'ఫాస్ట్ ట్రైన్ అనగా స్టేషన్లో కాక, స్టేషన్ల మధ్యలో ఆగునది' అని ఇంకో శాల్తీ జోకాడు. ఉక్కగా ఉంది. కొందరు రైలు దిగి పట్టాల గుండా నడుస్తున్నారు. రైలు అంతసేపు ఎందుకు ఆగిందో తెలియడం లేదు. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో దినమంతా పనిచేసి అలసిసొలసి ఉన్నారు జనం. ఇప్పుడు ఈ అవాంతరం. దాదాపు అరగంట తర్వాత కుంటి నడకన బయలు దేరింది ట్రైన్. బోరివలి చేరగానే ప్రకటన. దహిసర్లో ఓవర్ హెడ్‌వైర్లు తెగిపోవడం వలన ట్రైన్ సర్వీసుల బోరివలి వరకే సమాప్తం అని. ఈట్రైన్ సర్వీసు ఇక జన్మలో బాగుపడదు అని ఓ బాధితుని ఆక్రోశం. 'మనిషికి రావా జబ్బులు, మన శరీరంలో రక్తప్రసారం ఆగిపోతే మనం బతికేమా? ట్రైన్ సంగతీ అంతే అనుకోవాలి. అవి మాత్రం ఎన్ని రోజులని అవిశ్రాంతంగా పనిచేస్తాయి?' ఇంకో సహ ప్రయాణీకుని సమర్థింపు.

సన్యాసిరావు మీరా రోడ్ వెళ్ళాలి. సెంట్రల్ సబర్బ్ ట్రైన్ సర్వీసు అంత బావుండదని వెస్టర్న్ సబర్బన్‌కు మారితే ఇక్కడా అదే కథ. ట్రైన్లో పది నిమిషాలతో సరిపోయే ప్రయాణం రోడ్డు ద్వారా, గూడు చేరడానికి రెండు గంటలపైనే పట్టింది. బస్సు, ఆటో, టెంపో ఇలా రకరకాల వాహనాల ఆసరాతో, అంత జన సందోహంలో నానా అవస్థలు పడి పదకొండు గంటలకు ఇల్లు చేరుకున్నాడు. వంట చేసుకునే ఓపిక లేక హోటల్లో టిఫిన్ చేసి భోజనం అయిందని సరిపెట్టుకున్నాడు. మళ్ళీ పెందలాడే లేచి మరోదినం సమరానికి ఆయత్తమవడానికి, పడకలో పడిపోయాడు సన్యాసిరావు.

సన్యాసిరావుకు ఇంక్రిమెంటొచ్చింది. మరో ఆలోచన రానీయకుండా దాన్ని ఫస్ట్ క్లాస్ సీజన్ టికెట్టుకు కేటాయించాడు. దాని ధర నాలుగు రెట్లు ఎక్కువైనా! సెంకడ్ క్లాస్ ప్రయాణంతో అంత విసుగెత్తిపోయాడు మరి!

ఓ వారం రోజులు పోయాక, 'డబ్బూ పోయింది, సుఖమూ దక్కడం లేదు' అనే అభిప్రాయానికి వచ్చాడు సన్యాసిరావు. కాకపోతే ఇక్కడి ఇక్కట్లు మనుషులు కల్పించినవి. ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేసే వాళ్ళు డబ్బులోనే కాదు. దర్పంలో కూడా తమ ఆధిక్యత చాటుకుంటారు. సన్యాసిరావు గమనించిందేమంటే వారి శరీర విస్తీర్ణం కూడా ఎక్కువే! అభివృద్ధి అన్ని వైపులా కనిపిస్తుంటుంది! సెకండ్‌క్లాస్‌లో నలుగురు కూర్చునే సీటు మీద వీరు ముగ్గురు కూర్చుంటారు. తాము ట్రైనెక్కగానే సరి ముందుకు కదలరు. పంఖా కింద నుంచుంటారు. వెనక వారిని లోనికి వచ్చే సందు కూడా ఇవ్వరు. మిగతావారి గురించి పట్టించుకునే అవసరం, అలవాటు వారికి ఉండదు. వీరి డిక్షనరీలో సర్దుబాటు అనే పదం కనబడదు. ట్రైన్ తమ సొంత ఆస్తి అన్నట్టు ప్రవర్తిస్తారు. సీట్ల మధ్య నుంచుంటే ఎగాదిగా చూస్తారు. ఎంతరద్దీ ఉన్నా వాళ్ల కాళ్లకు మన కాళ్ళు తగలకూడదు. సన్యాసిరావు తారెత్తిపోయాడు. బ్రీఫుకేసుల దెబ్బలతో అతని కాళ్ళు మోకాళ్లు వాచిపోయాయి. రెండు రోజులు రెస్టు తీసుకుని మళ్ళీ పనిలో జాయినయ్యాడు. ఈ ఇబ్బందులకు బెదిరి మళ్ళీ సెకండ్ క్లాస్‌కు మారనా? లేక ముంబై నుంచి బిచాణా ఎత్తేయనా? అనే దాకా వచ్చింది.

అతని సహోద్యోగి ఓసారి, వారింటికి భోజనానికి పిలిచాడు. మొహమాటపడుతూనే వసంత్ ఫడ్కే అనే అతనింటికి ఓ ఆదివారం వెళ్ళాడు. భోజనాలయిం తర్వాత తాంబూలం వేసుకుంటూ తన తండ్రిని పరిచయం చేశాడు వసంత్. ఆయన రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్, ఇప్పుడు పౌరోహిత్యం చేస్తున్నాడు. మాటల్లో సన్యాసిరావు తన ఇక్కట్లు ఏకరువు పెట్టాడు. తిరిగి తన వూరుకు వెళ్ళాలనుందన్నాడు. ఇక ముసలాయనకు మూడ్ వచ్చింది.

"ఏం? మీ ఊళ్ళో మాత్రం ఏం ఇబ్బందులు ఉండవా? అక్కడ నీకు బాగా ఉంటే ఇక్కడికెందుకొస్తావు? అంటే నీబ్రతుకు తెరువుకి అక్కడి కంటే ఇక్కడ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయనే కదా అర్థం? అలాంటప్పుడు ఇంతమంచి ఉద్యోగం వదులుకుని అక్కడ ఏం చేద్దామని? అసలు జీవితమంటే నీకు అర్థం తెలుసా? హాయిగా తిని పడుకుంటే సుఖంగా ఉన్నట్టా? అదేనా జీవిత పరమార్థం? అసలు కష్ట పడకుండా ఎవరు సుఖపడ్డారు చెప్పు? ఒకటి సాధించాలంటే ఇంకోటి కోల్పోక తప్పదు. అవ్వ కావాలి, బువ్వ కావాలి అంటే కుదరదు. ఇబ్బందులను ప్రగతికి సోపానాలుగా మలుచుకోవడంలోనే మన నైపుణ్యం ఉంది. తాటాకు చప్పుళ్ళు లాంటి చిన్న చిన్న అవాంతరాలకే బెదిరిపోతే ఎలా? ఇంకా ఎంతో జీవితం ఉంది. నీలాంటి చురుకైన యువకుడికి ఇక్కడ నుంచి భవిష్యత్తు ఉంది. పిచ్చి

పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి, నీ పనిలో మంచి ఆసక్తి చూపించు ప్రమోషన్లకై నిచ్చెనలు వేయి. ఒక్కో మెట్టు ఎక్కుతూ శిఖరానికి చేరుకో, నీకిదే నా ఆశీస్సు."

పెళ్ళిలో మంత్రంలా చదివాడు గజానన్ ఫడ్కే.

సన్యాసిరావు అవాక్కయ్యాడు. మంచి భోజనం పెట్టించి బాగా అక్షింతలు వేయించాడని తన మిత్రున్ని మనసులో నిందించాడు. మాహిమ్‌లో ట్రైనెక్కాడు. ట్రైన్‌లో ఆ ముసలాయన మాటలే గింగురు మంటున్నాయి. తీరిగ్గా ఆలోచిస్తే, వాటిలోని నిజం తెలిసొచ్చింది. అకారణంగా మిత్రున్ని, అతని తండ్రిని, మనసులోనైనా తిట్టుకున్నందుకు బాధ కల్గింది. మనసులోనే లెంపలు వేసుకున్నాడు. ఇప్పుడు సన్యాసిరావు దృక్పథం మారింది. సుమతీ శతకకారునికి నివాళ్ళులర్పించి నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరగడం నేర్చుకున్నాడు. సెకండ్ క్లాస్ అయినా, ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ అయినా, పరిస్థితి ఇంతే అని మనసు దిటవు చేసుకున్నాడు.

ఓ రోజు... ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో మామూలుగానే నిల్చున్నాడు. ముందు చూస్తే ఇనుప జాలీ. ఆ జాలీకి ఆవల లేడీస్ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్. ఆ కంపార్ట్ మెంట్‌లో ఓ మగువ. సన్యాసిరావు చూపులు నిలిచిపోయాయి. ఏదో విద్యుచ్ఛక్తి అతని నరాల్లో ప్రవహించింది. చూపులు మరల్చలేకపోయాడు. ఇక ఆ ట్రైన్ అతనికి పర్మినెంటయింది. సీటు దొరికినా సన్యాసిరావు కూర్చోడు. అలాగే నుంచుని ఆమె వైపు తదేకంగా....

ముందు ఆమె చీదరించుకున్నట్లు మొహం పెట్టింది. ఆ తర్వాత వెకిలి చేష్టలు లేవు కదా అని సరిపెట్టుకుంది. తనూ దొ చూపులు మొదలు పెట్టింది. అలా కొన్ని రోజుల తర్వాత, స్నేహితుని ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో ధైర్యం కూడదీసుకున్నాడు సన్యాసిరావు. పరిచయం చేసుకున్నాడు.

మన్మథుడు తన డ్యూటీ చేశాడు.

సబర్బన్ ట్రైన్‌లో మొదలైన వారి ప్రేమయానం పార్కులు, బీచ్‌లు, సినిమాల మార్గం గుండా పయనించి వివాహ వేదికపై ఏకమై, పూలపాన్పుకు చేరింది. తర్వాత జరిగింది మనకు తెలియదు. లైటు ఆర్పేశారు.

అయినా దానిలో తెలియడాని కేముంది? సృష్టి మొదలైంది మొదలు కొనసాగుతున్నది, తేలియాడుతున్నది, ఆ రసఝరీ తరంగాలలోనే కదా! ఆకోలాలో పుట్టిన అమృత అనకాపల్లికి మెట్టడంలో చాలా చాలా కిష్టమైన బాటల గుండా ప్రయాణించింది. సబర్బన్ ప్రయాణంలో రాటు దేలిన సన్యాసిరావుకు తన జీవితబాటలో తన తల్లిదండ్రుల నుండి, బంధుమిత్రుల నుండి తన సహ ప్రయాణీకురాలు అమృత పుట్టింటి వారి నుండి ఎదురైన సమస్యలు, గడ్డిపోచల్లా కనిపించాయి. వాటిని అధిగమించి తన గమ్యం చేరుకున్నాడు.

అమృత – సన్యాసిరావు. తమ జీవిత నౌకను సబర్బన్ ట్రైన్ తరంగాలలో తేలిపోతూ వాటి అలల్లోనే ముందుకు పోతున్నారు. ముంబయి జీవనాడి సబర్బన్ ట్రైన్ అంటే ఇప్పుడు సన్యాసిరావుకు పులకింత అమృతాన్నిచ్చిన దేవత!

... జీవన్ చల్‌నేకా నామ్ చల్‌తే రహో సుబహశామ్... రేడియో తరంగాలు ఎక్కడి నుండో కదిలివస్తున్నాయి. **('రచన' మాసపత్రిక ఫిబ్రవరి 2000)**